క్లుప్తంగా

కారు వేలం.. రూ.82వేల ఆదాయం

బంగారుపాళెం: కారు వేలంలో ప్రభుత్వానికి రూ 82,600 ఆదాయం వచ్చిందని సీఐ లక్ష్మయ్య శుక్రవారం తెలిపారు. అక్రమ మద్యం కేసుకు సంబంధించి సీజ్ చేసిన కారును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం వేసినట్టు చెప్పారు.

వన్‌టౌన్ స్టేషన్ తనిఖీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మణికంత చందోలు శుక్రవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్టేషన్‌కు వచ్చిన ఎస్పీ.. పలు క్రైమ్ రికార్డులను పరిశీలించారు. దర్యాప్తు పూర్తిచేయని వాటిని, త్వరగా పూర్తిచేసి కోర్టుకు ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. పెండింగ్ కేసులను ఎక్కువ రోజులు పెట్టుకోవద్దని, వీలైనంత త్వరగా వీటిని పూర్తి చేయాలన్నారు. స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను వీలైనంత తర్వరలో వేలం వేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ విశ్వనాథరెడ్డి ఉన్నారు.

సబ్సిడీపై మొక్కజొన్న, జొన్నలు పంపిణీ



రైతులకు మొక్కజొన్న, జొన్నలు పంపిణీ చేస్తున్న సాయిసుధ, రమ్య

గుడిపాల: పాడి రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న, జొన్నలను పంపిణీ చేస్తున్నట్లు గుడిపాల పశు వైద్యాధికారి సాయిసుధ, జిల్లా జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య తెలిపారు. శుక్రవారం పాపసముద్రం, 189కొత్తపల్లె, రామాపురం, వసంతాపురం, బొమ్మసముద్రం రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న, జొన్నలను రైతులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, మండలానికి ఐదు టన్నులు మొక్కజొన్న, జొన్నలు వచ్చాయన్నారు. 70శాతం సబ్సిడీ పోను మొక్కజొన్న 5కిలోల బ్యాగు రూ.90, జొన్నలు 5 కిలోల బ్యాగు రూ.115లకు ఇస్తున్నట్టు చెప్పారు.

సీఐగా శ్రీనివాసరావు



చిత్తూరు అర్బన్: చిత్తూరు తాలూక సీఐగా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు పోలీసు శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న ఆయనను తాలూకకు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడటం విదితమే.

టీచర్ల సమస్యలు పరిష్కరించరూ!



ఎంఈఓ సెల్వరాజ్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మునిసిపల్ కార్పొరేషన్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు లత డిమాండ్ చేశారు. గురువారం చిత్తూరులోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ సెల్వరాజ్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. సేవా పుస్తక నిర్వహణ వేతన బిల్లులు, క్రమ శిక్షణ చర్యలు..తదితర అంశాలను ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. టీచర్ బిల్లుల తయారీలో స్కూల్ అసిస్టెంట్ల జోక్యం ఉండరాదని, మండల ప్రాంతాల్లో ఇద్దరు టీచర్లను కలిపించాలని, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, డెప్యుటేషన్‌లో సడలింపులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రబాబు, చెంగల్రాయ మందడి పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో ఉన్నత శిఖరాలకు..



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పూతలపట్టు: విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని సత్ప్రవర్తనతో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల అధ్యాపకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కళాశాలకు రోడ్డు సౌకర్యం, క్రీడా మైదానం లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే.. దారి సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

నేడు బస్సుల ప్రారంభోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శనివారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా నూతన బస్సులను ప్రారంభించనున్నట్టు అసిస్టెంట్ డిపో మేనేజర్ అల్తాఫ్ తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించిన మొత్తం 16 బస్సులను ప్రారంభిస్తారని ఆయన చెప్పారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వండి

- కలెక్టర్ సుమిత్ కుమార్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు అర్బన్: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని కలెక్టర్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, మేయర్ ఎస్ అముద, కమిషనర్ జె అరుణ ప్రారంభించి మాట్లాడారు. నగర, పురపాలక సంఘాల పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రత్యేక వైద్యులతో వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. అలాగే కార్మికులకు ఆరోగ్య బీమా, జీవిత బీమా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఏడాదికి రూ.1,500 చెల్లిస్తే రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యాన్ని పొందవచ్చని, చిత్తూరు, తిరుపతి జిల్లాలో ఏడు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందవచ్చన్నారు. నగర, పురపాలక సంఘాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, బూట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. తొలిరోజు శిబిరంలో 1–25 వార్డులకు సంబంధించిన పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు కమిషనర్ తెలిపారు. అపోలో, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు చెందిన 14 మంది వైద్య నిపుణులు 10 విభాగాల్లో వైద్య సేవలు అందించారని చెప్పారు. ఈ శిబిరం శనివారం కొనసాగుతుందని, మిగిలిన కార్మికులు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ అనిల్ కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ మేయర్ కె.హేమలత, కార్పొరేటర్లు, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష



ఐరాల: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తవణంపల్లె: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రియాంక

ఐరాల: బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ముర్రుపాల వల్ల వ్యాధి శిశువుల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. బిడ్డలు ఆరోగ్యకరంగా పెరగాలంటే తల్లిపాలు విధిగా ఇవ్వాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బంది కలిసి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: తల్లిపాల వారోత్సవాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులు, బాలింతలకు వివరించాలన్నారు. శిశువుల సంపూర్ణ మానసిక వికాసానికి తల్లిపాలతోనే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్లు రెడ్డెమ్మ, నిర్మలమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యంరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు

మండలంలోని కరణంవాండ్లవూరు, కె.గొల్లపల్లెలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులు, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. నవజాత శిశువుకు మొదటి ఆహారమైన తల్లిపాలలో ఉన్న పోషక గుణాలు మరే ఇతర పాలలో ఉండవన్నారు. తల్లులు బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నిత్యబాబు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలు తెలుసుకోవాలని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు అన్నారు. నగరంలోని కొంగారెడ్డిపల్లెలోని సర్‌సీఆర్ఆర్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ట్రాఫిక్‌లో రోడ్డుపై ఎలా ప్రయాణించాలి? తెల్లలైన్, పసుపు రంగు లైన్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. జంక్షన్‌లో నీలం, ఎరుపు, పచ్చ రంగు సిగ్నల్స్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు మమతానాథ్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని కొంగారెడ్డిపల్లెలో ఉన్న సంసిద్ధ్ క్యాంపోర్డ్ పాఠశాల, గిరింపేట మున్సిపల్ హైస్కూళ్లలో ఈ నెల 4వ తేదీ నుంచి 14 రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు యోగాచార్యులు నరేంద్ర శుక్రవారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లు పైబడిన వారు ఈ తరగతుల్లో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 8247609140 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇళ్ల ముంగిటకే వైద్యం



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష



ఐరాల: వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్



తవణంపల్లె: రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

ఐరాల: 'ఫ్యామిలీ డాక్టర్'తో గ్రామీణ పేదలందరికీ ఇళ్ల వద్దకే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మొరంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నంగమంగళంలో..

గుడిపాల: వైద్యసేవలు అందించేందుకు ఇళ్ల వద్దకే వస్తున్నట్టు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. శుక్రవారం నంగమంగళంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. బీపీ, షుగర్, గర్భవతులకు వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలంగా మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో వాకబు చేసి సలహాలు–సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీలత, పవిత్ర, రూబి, సరిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లోనే గర్భవతులు ప్రసవించాలి

తవణంపల్లె: ఆస్పత్రుల్లోనే గర్భవతులు ప్రసవించడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులు తమ ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, 104, 108 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎగువమత్యంలో..

మండలంలోని ఎగువమత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి వినయ్ కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్



విజయ భారతి సైనీకి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ విజయ భారతి సైనీ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం కుటుంబ సభ్యులతో వచ్చిన ఆమెకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి దర్శించుకున్నారు.

నాగాలమ్మ జాతర



నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్: ఆడి నెలను పురస్కరించుకుని చిత్తూరు ఎస్టేట్‌లోని ఆటోనగర్‌లో శుక్రవారం కార్మికులు, యజమానుల ఆధ్వర్యంలో నాగాలమ్మ జాతరను అట్టహాసంగా నిర్వహించారు. వీధిలో అమ్మవారిని కొలువుదీర్చి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. డప్పు వాయిద్యాల హోరు నడుమ భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అంబలి నైవేద్యంగా సమర్పించారు. మండపం ఆవరణలోని పుట్టలో పాలు పోసి నాగాలమ్మను కొలిచారు. సాయంత్రం అమ్మవారి ఊరేగించారు. ఆదివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తామని జాతర పెద్దలు తెలిపారు.

బుస్స్స్స్స్..!



మేటింగ్ సీజన్‌లో పాముల కలయిక

- విష సర్పాల బెడద
- రెండేళ్లలో 32 మందికి పాముకాట్లు
- పదిమంది మృత్యువాత
- నాటు వైద్యంతో ప్రాణాలు కోల్పోతున్న మరి కొందరు
- ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం
- సకాలంలో చికిత్స పొందాలంటున్న వైద్యులు

వర్షాలు మొదలవడం, సీజన్ మారడంతో ప్రస్తుతం పాముల బెడద పీడిస్తోంది. ప్రధానంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు పాముకాట్ల గురవుతున్నారు. ఇటీవల చినిగిపల్లెకు చెందిన రైతు లక్ష్మప్ప పాముకాటుకు గురై నాటు పసర్లు వైద్యం చేయించుకున్నాడు. పరిస్థితి విషమించడంతో కోలారులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి కన్నుమూశాడు. పెద్దపంజాణి మండలంలోని గుట్టూరు పాముకాటు వైద్యశాలలో(నేమరోపతి) రోజు సగటున నలుగురు పాముకాట్లకు గురైన వారు చికిత్స కోసం వస్తున్నారు. రెండేళ్ల వ్యవధిలో 32మంది పాముకాటుకు గురయ్యారు. పదిమంది మృత్యువాత పడ్డారు.

పలమనేరు: మూడేళ్లుగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో చెట్లు, పొదలు బాగా పెరిగాయి. దీంతో పాములే కాకుండా తేళ్లు, జెర్రులు, మండ్రగబ్బలు లాంటి విషకీటకాలు బాగా వృద్ధి చెందాయి. వీటి పుట్టలు, ఆవాసాల్లోకి నీళ్లు చేరుతుండడంతో ఇవి పొలం గట్లు, ముళ్లపొదలు, చేలల్లో సంచరిస్తున్నాయి. ఇటీవల కొండచిలువలు సైతం ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. పొలం పనులు చేస్తున్నప్పుడు, గడ్డికోతలు, రాత్రివేళల్లో పొలానికి నీరుపెట్టడం లాంటి పనులకెళ్లినప్పుడు పాముకాట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉదయం కాసే ఎండకు, సాయంత్రం వేళ, రాత్రిపూట ఎక్కువగా పాములు సంచరిస్తుంటాయని స్థానికంగా పాములు పట్టేవాళ్లు చెబుతుంటారు.

ప్రాణాలమీదికి తెస్తున్న నాటు వైద్యం

పాము కరిస్తే ప్రభుత్వాసుపత్రుల్లో పాముకాటుకు విరుగుడు మందులు అందుబాటులో ఉన్నాయి కానీ చాలామంది నాటువైద్యం, ఆకు పసరు వైద్యం, మంత్రాలు, నెత్తిన రాళ్లు పెట్టే విధానాలను పాటిస్తూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు.

పాములన్నీ విషపూరితం కావు

వాస్తవానికి పాములన్నీ విషపూరితమైనవి కావు. రెండు కాట్లు ఉంటే అది విషసర్పం కాటుగా గుర్తించాలి. అదే పైన రెండు, కింద మరో రెండు కాట్లు ఉంటే విషరహితమైన పాము కాటుగా భావించాలి. ప్రధానంగా నాగుపాము, రక్తపింజరి, కట్లుపాముల్లో ఎక్కువ విషం ఉంటుంది. వాస్తవానికి చాలామంది పాము కరిచిన వెంటనే తీవ్రమైన ఆందోళనకు గురై ఇక బతకమేమోననే భయంతో మృతి చెందుతుంటారు. పాముకాటుకు గురైన వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయిస్తే వారిలో 99శాతం ప్రాణాపాయం నుంచి గట్టెక్కినట్టే. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ పాముకాటుకు అవసరమైన యాంటీ స్నేక్ వీనం మందు అందుబాటులో ఉంది.



ఇటీవల రంగినాయనిపల్లెలో ఇంటిపక్కకొచ్చిన కొండచిలువ(ఫైల్)

పాము కాటేస్తే నేరుగా ప్రభుత్వాసుపత్రికి తీసుకురావాలి



ఏపాము కాటుకు గురైనా తొలుత భయాన్ని వీడి ఆత్మస్థైర్యంగా ఉండాలి. పాముకాటుకు గురైన చోట కట్లుకట్టడం, బ్లేడ్‌తో రక్తాన్ని పీల్చడం లాంటి పనులు చేయకూడదు. నాటువైద్యం జోలికెళ్లరాదు. సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలి. ఇక్కడ పాముకాటుకు అవసరమైన మందులున్నాయి. ముఖ్యంగా పాముకాటుకు గురైన వారిలో రక్తపువాంతులు, కళ్లు తిరగడం, నీలిరంగులోకి మారడం, బీపీలో హెచ్చుతగ్గులు, పంటి చిగుళ్లలో రక్తస్రావం, శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది లాంటి లక్షణాలుంటాయి.

డాక్టర్ మమతారాణి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పలమనేరు

రైతులు పొలాల వద్ద జాగ్రత్తగా ఉండాలి



పాములుండే అవకాశం ఉన్న చోట్లపై రైతులకు అవగాహన ఉంటుంది. ఎక్కువగా పొదలు, నేల కనిపించని స్థలాల్లో పాములుండే అవకాశం ఉంది. రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లే రైతులు ఖచ్చితంగా మోకాలివరకు ఉండే బూట్లు వేసుకోవాలి. గజ్జెలు కట్టిన కర్రను వాడాలి. కర్రతో నేలను తాటిస్తూ శబ్దం చేస్తూ వెళితే పాములు దరికి రావు. పొలాల గట్లను చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. వీలైతే గట్లకు సున్నంచల్లడం కూడా మంచిదే.

-అన్నపూర్ణదేవి, ఏడీ, వ్యవసాయశాఖ, పలమనేరు

పాముకాటుతో విద్యార్థినికి అస్వస్థత



తిరుపతిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

నింద్ర : మండలంలోని కూనమరాజుపాలెం గ్రామానికి చెందిన విద్యార్థిని పాముకాటుతో అస్వస్థతకు గురైంది. గోవిందరాజులు కుమార్తె హర్షిత(13) విజయపురం మండలం పన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఆమె గురువారం రాత్రి ఇంటి వద్ద నిద్రించింది. ఆ సమయంలో పాము కాటు వేసింది. గమనించని విద్యార్థిని శుక్రవారం యధావిధిగా పాఠశాలకు వెళ్లింది. విషం ప్రభావం చూపడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఉపాధ్యాయులు వెంటనే ఆమెను తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని పేర్కొంటూ తిరుపతి రుయాకు రిఫర్ చేశారు. ప్రస్తుతం విద్యార్థి రుయాలో చికిత్స పొందుతోంది. విద్యార్థినికి మాటలు రావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు.

6న హాస్టళ్ల సమస్యలపై ధర్నా



పుంగనూరులో సమావేశమైన ఏఐఎస్ఎఫ్ నాయకులు

పుంగనూరు: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న జిల్లా కలెక్టరేట్ వద్ద చేయతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక నాయకుడు మున్నా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, వీటిని పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ధర్నా చేయనున్నట్టు చెప్పారు. అనంతరం పట్టణ ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

పట్టణ శాఖ అధ్యక్షుడిగా సతీష్, కార్యదర్శిగా మోహన్, ఉపాధ్యక్షులుగా ధనుష్, రాజేష్, ఆసిఫ్‌అలీ, సహాయ కార్యదర్శులుగా రెడ్డి, తేజ, మహిళా కన్వీనర్లుగా జయలక్ష్మి, శిరీష, రాగాంజలి, కోశాధికారిగా మనోజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా నాయకులు సూరి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ పరికరాల కొనుగోలుకు విరాళం



విరాళం ఇస్తున్న డాక్టర్ మురళీధర్

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలోని స్కూల్ ప్లస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ పరికరాల కొనుగోలుకు డాక్టర్ మురళీధర్ రూ.60 వేల విరాళంగా అందజేశారని హెచ్ఎం నాగరాజరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీసీ విద్యార్థుల సౌకర్యార్థం కోరిన వెంటనే స్పందించి ల్యాబ్ పరికరాల కొనుగోలుకు ఆర్థిక సాయం చేసిన డాక్టర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, అమర్‌నాథ్ రెడ్డి, సుధాకర్, సుదర్శన్, మురళి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.